# ఇందూరును ఎంతో అభివృద్ధి చేశా..



దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

- మరోసారి ఆశీర్వదించి గెలిపించండి..
- ఆత్మీయ సమ్మేళనంలో అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

ఖలీల్‌వాడి, నవబంర్ 1: ఇందూరు నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి తనను ఆశీర్వదించాలని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా కోరారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న కమ్యూనిటీ హాలులో బుధవారం నిర్వహించిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో బిగాల పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో దివ్యాంగుల కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలుకావడం లేదన్నారు. దివ్యాంగుల కష్టాలను సీఎం కేసీఆర్ మానవీయ కోణంలో ఆలోచించారన్నారు. వారు ఎవరికీ భారం కాకూడదనే ఉద్దేశంతో ఆర్థిక ఇబ్బందులను గుర్తించి దేశంలో ఎక్కడా లేని విధంగా అధిక పింఛన్ ఇస్తున్నారని తెలిపారు. 40శాతానికి పైగా వైకల్యం కలిగిన వారికి రుణాలు ఇచ్చి చేయూతనిచ్చారని చెప్పారు. ప్రజల కష్టసుఖాలు తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. నగరంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందించామని చెప్పారు. ప్రతి గల్లీని అభివృద్ధి చేశామని, సంక్షేమంలో భాగంగా ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అందిస్తున్నామని వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి ఉచితంగా కార్పొరేట్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీ అయితే రూ.12 వేలు, కేసీఆర్ కిట్‌ను ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.400లకే వంటగ్యాస్, రేషన్ కార్డు కలిగిన వారికి సన్నబియ్యం ఇస్తామన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా నిరుపేద మహిళలకు రూ.3వేలు ఇస్తామని చెప్పారు. అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, బీఆర్ఎస్ నాయకులు దండు శేఖర్, ఎనుగందుల మురళి, పోల నారాయణ, పంచరెడ్డి సూరి, నవీన్, వెల్డింగ్ నారాయణ, ముత్యాలు, బైఖాన్ మధు, రాజేంద్రప్రసాద్, శివచరణ్, ఎర్రం గంగాధర్, మహిళా నాయకులు చంద్రకళ, చాంగుబాయి పాల్గొన్నారు.

# బోధన్‌లో కాంగ్రెస్‌ది మూడో స్థానమే



ఎడపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్

- సుదర్శన్‌రెడ్డితో పోటీయే లేదు..
- బోధన్, ఎడపల్లి సమావేశాల్లో ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

బోధన్/ ఎడపల్లి, నవంబర్ 1: మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒక దఫా మంత్రిగా పనిచేసిన కాంగ్రెస్ అభ్యర్థికి ప్రజల్లో ఎంతమాత్రం చరిష్మాలేదని, ప్రజలకు ఏనాడూ సేవ చేయని ఆయన ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమవుతారని ఎమ్మెల్యే షకీల్ అన్నారు. బోధన్ నియోజకవర్గంలో రెండవ స్థానంలో ఉండే బీజేపీతోనే తనకు పోటీ ఉందన్నారు. సుదర్శన్‌రెడ్డికి కనీసం ఒక వార్డు, గ్రామంలో కూడా మెజార్టీ ఓట్లు రావని చెప్పారు. బుధవారం బోధన్, ఎడపల్లిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేల్లో కూడా కాంగ్రెస్‌కు ఈ నియోజకవర్గంలో మూడో స్థానం ఉందన్నారు. బీఆర్ఎస్‌కు 47 శాతం, బీజేపీకి 30 శాతం, కాంగ్రెస్‌కు 18 శాతం ఓట్లు వస్తాయని సర్వేలు చెబుతున్నాయన్నారు. సుదర్శన్‌రెడ్డి జిల్లాలో ఒక్క బీసీకి కూడా కాంగ్రెస్ టిక్కెట్ ఇప్పించలేదని, తన చుట్టాలు, తన సామాజికవర్గం వారికే టిక్కెట్లు ఇప్పించుకున్నారని విమర్శించారు. జిల్లాలో 50 శాతం కన్నా ఎక్కువగా ఉన్న బీసీలు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. బీసీలు, దళితులు, మైనార్టీలకు టిక్కెట్లు ఇవ్వకుండా బడుగు, బలహీనవర్గాలకు మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని జిల్లాలో ఓడించాలని షకీల్ పిలుపునిచ్చారు. ప్రజల కోసం నిరంతరం కృషిచేస్తున్న సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలన్నారు. కాంగ్రెస్ వస్తే రాష్ట్రంలో మత కలహాలు, విధ్వంసాలు ఉంటాయని, రక్తచరిత్ర కలిగిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. సీఎం కేసీఆర్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలపై పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలు అందని కుటుంబాలు లేవని, ఈ విషయంలో వారికి అవగాహన కల్పించాలన్నారు.

# బీఆర్ఎస్ ఎంపీపై దాడి హేయమైన చర్య



- నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- నిజామాబాద్ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఖలీల్‌వాడి, నవంబర్ 1 : దుబ్బాక ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకుడు రాజు కత్తితో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నిజామాబాద్ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య రాష్ట్రంలో ఎంపీపై దాడిచేసిన కాంగ్రెస్ నాయకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పదేండ్ల పాలనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సామరస్యంగా అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్న బీఆర్ఎస్ నాయకులపై దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. సమావేశంలో నీలంరెడ్డి, శంకర్, రమణారావు, మాయావార్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

# మీరే నా బలం.. బలగం




మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

- బీసీ బిడ్డను మరోసారి ఆశీర్వదించండి..
- చంద్రబాబు ఏజెంట్ రేవంత్‌రెడ్డి
- మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనంలో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, నవంబర్ 1 : మీరే నా బలం.. నా బలగం అని మీరంతా మరోసారి నన్ను ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఏకైక బీసీ నాయకుడిని తానేనని మున్నూరుకాపు కులస్తులందరూ ఐక్యంగా తనకు అండగా ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అగ్రవర్ణాలకే పెద్దపీట వేస్తున్నాయని, బీఆర్ఎస్ పార్టీ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన తనకు మూడోసారి అవకాశం కల్పించారని, నియోజకవర్గ ప్రజలు తనను ఆదరించి గెలిపించాలని కోరారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబు ఏజెంట్ అని ఎన్నో పార్టీలు మారిన వ్యక్తి అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి చెప్పే మాయమాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని పిలుపునిచ్చారు. రైతులకు 24గంటల ఉచిత కరెంట్ అందజేస్తుంటే రేవంత్‌రెడ్డి మూడు గంటలు సరిపోతుందని పేర్కొనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. పదేండ్లుగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టి సీఎం కేసీఆర్ సుపరిపాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. అంతకు ముందు మున్నూరుకాపులు ఎమ్మెల్యే బాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌కు నాగలి బహూకరించి, గజమాలతో ఘనంగా సత్కరించారు. నల్లవెల్లి ప్రైవేటు పాఠశాలకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇందల్వాయి గ్రామానికి చెందిన 4 మున్నూరు కాపు సంఘాలు బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశాయి. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, మున్నూరుకాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న, జిల్లా అధ్యక్షుడు బాజిరెడ్డి జగన్‌మోహన్, జిల్లా నాయకులు పట్వారి లక్ష్మణ్, రమాకాంత్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తా**

డిచ్‌పల్లిలోని జీ కన్వెన్షన్ హాలులో బుధవారం రాత్రి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భం గా స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.



విశ్వకర్మ ఆత్మీయ సమ్మేళనంలో స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటిస్తున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు

